గోడలు

"కథ చెప్తాను... కూచో"

నారాయణ నా కళ్లల్లోకి సూటిగా చూశాడు. చేతి వేళ్లతో జుట్టు దువ్వుకుని అయిష్టంగా అన్నాడు, "నువ్ కథ చెప్తానంటే భయమేస్తుంది. ఇజాలూ, దోపిడీ గట్రా అంటూ హింసిస్తావ్"

నేను నవ్వాను. "అవేమీ రానీను, కూచో"

కూచున్నాడు. నేను గదిలో వొక మూలగా ఉన్న కూజా దాక నడిచాను. గ్లాసులో నీళ్లుపోసుకొని తాగి వెనక్కి తిరిగి నారాయణని అడిగేను, "నీళ్లుతాగుతావా?" అని "వద్దు" అన్నాడు.

వచ్చి నారాయణ ఎదురుగా కూచున్నాను.

నాటకం ఆరంభానికి తెర తీయబోతున్నట్టు వుంది వాతావరణం. మా ఇద్దరి మధ్యా గాలి బొంగురుపోతోంది. గదిలో అర్థంకాని వేడిమి పరచుకుంటోంది. బయటకిటికీలోంచి సూర్యుడు కొలిమిలోనుంచి తీసిన అయఃపిండంలా వెలుగుతున్నాడు. వేపచెట్టు ఆకులు సూర్యుడితో ఆడుకుంటూ, గాలిని వెక్కిరిస్తున్నాయి. నేను చెప్పటం మొదలెట్టాను.

***

ఇలాంటి సంధ్యా సమయమే. అయితే చలికాలం. దక్షణపుగాలి తేమగా వీస్తోంది. నింగీనేలా చల్లబడ్డాయి.

మేము బిర్లాటెంపుల్ మెట్లమీద ఉన్నాము.

నేనూ....శ్రీదేవీ!

మాకు కాస్తంత దూరంలో మనుషులు. ఎటుచూసినా మనుషులు... మనుషులు...! పల్చగా... అక్కడక్కడా మాలాగేనే పక్కపక్కగా జంటలు. కొన్ని జంటలు చలికి వెచ్చగా వొదిగి వొదిగి...ఒకరికొకరు సర్వమూ సమస్తమూ అయినట్టు... ఈ గాలీనేలా, మెట్లూ, చల్లదనమూ తమకోసమేనన్నట్టు... తమకోసమే

తమకు, మాత్రమే శాశ్వతమన్నంత వెచ్చగా దగ్గర దగ్గరవుతూ... తమకుతాము, తమలోతాము, తాము మాత్రమే శాశ్వతమన్నంత నమ్మకంగా....

చుట్టూ చూసి, ఆలోచనల రథ్యలో సాగుతున్నాను నేను.

ఆపింది శ్రీదేవి. “ ఒక విషయం చెప్పటానికి నిన్ను రమ్మన్నాను”

ఉలిక్కిపడి ఆమెకేసి చూశాను.

నా కుడిచేతిని తనచేతిలోకి తీసుకుంది.అరచేతిలో పిచ్చిగీతలు గీస్తూ అన్నది, “అమ్మా నాన్నా నాగురించి, చాలా ఆలోచిస్తున్నారు....”

ఆగింది. వంగి నా కళ్లల్లోకి చూసింది. చెవి జూకా నా చెంపకు తగిలింది. భావశూన్యంగా ఆమెకేసి చూశాను.

“ శ్రీముఖం వారి సంబంధం ఏదో రాశాట్ట మా బాబాయి.” మాటలు తుంపులు తుంపులుగా వచ్చినై. నాందీ, ప్రస్తావనా అయిపోయాయి.

“ఊఁ” అన్నాను. నా స్వరం అతిదీర్ఘంగా వుందో, ఆ “ఊ”కి ముందరి ఉచ్ఛ్వాసమూ, వెనుక నిశ్వాసమూ అతి ఊష్ణం వున్నాయో...

చప్పున నా చేతిని వదిలేసింది శ్రీదేవి. పమిట సరిచేసుకొని బుజం మీంచీ తిప్పి, నిండుగా కప్పుకుంది. దిక్కులు చూస్తూ మౌనంగా ఉండిపోయింది.

నేను ఆలోచిస్తున్నాను. నేను చేయాల్సిందేమిటో ఆలోచిస్తున్నాను. లేక నేను ఏంచేయాలని శ్రీదేవి ఆ విషయం నాకు చెప్పిందా?అని అలోచిస్తున్నాను. ఆమాటలు చెప్పటానికి ముందు ఆడపిల్ల చేతుల్లోని వేడిని రుచిచూసిన నా అరచేతికి క్షణంలో, మరుక్షణంలో కలిగిన స్థాన భ్రంశాన్ని గురించి ఆలోచిస్తున్నాను. ప్రవహిస్తున్న కాల ధారలో... కలిసి పోయి కలగాపులగమై పోయి, రూప రాహిత్యం చెందుతున్న భావధార... గురించి ఆలోచిస్తున్నాను.

నా అంతరంగ ఘోష... నాకుమాత్రమే వినపడుతోంది. అయినా శ్రీదేవి అడిగింది, “ఏంవిటి ఆలోచిస్తున్నావ్”

నవ్వు వచ్చింది. సమాధానం రాలేదు.

స్పష్టాస్పష్టంగా నిట్టూర్చింది, శ్రీదేవి. అవును ఆమె నాకు కొంత అర్థమై

చాలా ఎక్కువగా అర్థంకాని, ఆడపిల్లగా అనిపించింది.

నిముషాలు బరువుగా జరుగుతున్నై.

లైట్లువెలిగినై. నగరం వెలుగుచీకట్ల నర్తనశాలగా మారింది.

"అతను అమెరికాలో వుంటున్నాట్ట. జనవరి చివరికి వస్తాట్ట. వాళ్ల అమ్మా నాన్నా ఇక్కడే వుండేది. ఎప్పుడో వచ్చి చూస్తార్ట." గాలికి చెప్తున్న ఊసులా వుంది, శ్రీదేవి మాట.

మళ్లీ మౌనం.

ఒకరికొకరు సుముఖంలో, సమక్షంలో ఎవరెవరోలాగా, ఎవరికి ఎవరోలాగా ఉండిపోయాము.

శ్రీదేవి లేచింది. ముంగురుల్ని చేత్తో సరిచేసుకుంది. పక్కన పెట్టిన స్లిప్పర్స్ వేసుకుంది.

"వెళ్దాం పద" అంటూ అడుగులు వేసింది.

నేను తేరుకొని, చెప్పులు తొడుక్కొని నడక సాగించే సరికీ... ఆమె చాలా ముందుకు... నా కన్నా ముందుకు... ముందుకు వెళ్లిపోతోంది!

ఆ రాత్రి నా మనసంతా గచ్చుపొదలా అయిపోయింది.

శ్రీదేవి నా ఆలోచనలల్లో వివిధ రూపాల్నీ స్వభావాల్నీ సంతరించుకుంది. ఏవేవో పాత సంఘటనలూ, దృశ్యాలూ, నాకళ్ల ముందు నిలిచాయి.

శ్రీదేవి మా మామయ్య కూతురు.

చిన్నప్పటినుంచి మంచి చనువే వుంది మా ఇద్దరిమధ్య. బి.ఏ.దాకా ఒకే కాలేజీలో చదివాము. ఎం.ఏ.చేయటానికి మద్రాసు వెళ్లింది. సైకాలజీలో 'టాపర్'గా మాకందరికీ గర్వకారణం ఆమె. ఆ తరువాత పిహెచ్.డీ. కూడా అక్కడే చేసింది. నేను తెలుగు ఎం.ఏ. చేసి జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా కుదురుకున్నాను. శ్రీదేవికి ఒకటి రెండు ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ నుంచీ ఉద్యోగాలు వచ్చినై. ఇంకా నిర్ణయించుకోలేదు. కానీ, నేననుకోవడం ఆమె ఉద్యోగాల్లో చేరదు. ఇంకా ఉన్నతమైన ఆలోచనలు ఆమెవి.

చిన్నప్పుడు...

మున్సిపల్ హాస్పిటల్ ఆవరణలో ఆడుకుంటూ ఉండేవాళ్లం. మా జట్టు పిల్లలు చాలా మంది వచ్చేవాళ్లు.

ఒకరోజు... సరదాకి... నేను ఒక వేపచెట్టు ఎక్కి కొమ్మ వేరైన చోట కూచోని చెరకు ముక్క నములుతున్నాను. శ్రీదేవి వచ్చింది. చెట్టెక్కుతానంది. నువ్ ఎక్కలేవు వద్దంటే వినలేదు. తనంతతానుగా నేను కూర్చున్న చోటుకు వచ్చింది. నా జేబులోనుంచి తొంగిచూస్తున్న చెరకు ముక్కను తీసుకుంది. గాన్ని తింటూ 'జండాపై కపిరాజు' పద్యం పాడింది. మధ్య మధ్య పైకొమ్మని పట్టుకొని నిలబడి ఊగింది. కింద మాస్నేహితులంతా చప్పట్లు, గోల. వింత ఉత్సాహం. శ్రీదేవి నవ్వు . ఉన్నట్టుండి అడిగింది శ్రీదేవి. చక్రాల్లాంటి కళ్లను తిప్పుతూ "ఓ పాట పాడు"

నాకు గుటక పడలేదు. భయం వేసింది. చేతిలోని చెరుకు ముక్కను తినడం ఆపి తక్కున దూరంగా గిరవాటేశాను. ఆమె వైపు బెరుకు బెరుగ్గా చూస్తూ, "నాకురాదు" అన్నాను.

చప్పట్లు చరుస్తూ... "మా బావకు పాటలు రావు" అంటూ గేలి చేసింది. కిందనున్న పిల్లలు ఆమె కేరింతలకి శ్రుతి కలిపారు. నేను మొహం చిన్నబుచ్చుకున్నాను. చెట్టు దిగి వెళ్లిపోబోతుంటే చేయి పుచ్చుకొని ఆపింది. "కోపం వచ్చిందా" గడ్డం ఎత్తి నాకళ్లల్లోకి చూస్తూ... 'అమ్మ'లా అడిగింది. "ఊఁహూ" అని చూపులు పక్కకు తిప్పుకున్నాను. సిగ్గుపడటం అంటే అదేకాబోలు.

"నే పాడతా విను" అంటూ 'కోతీబావకు పెళ్లంట' పాడింది. అందర్నీ మంత్రముగ్ధుల్ని చేసింది. ఆమెది కిన్నెర స్వరం. మరి కొంత సేపు మా ఆటలు సాగినై.

కొమ్మమీద నిలబడి "నేను" చిటారు కొమ్మదాక పోయొస్తాను వస్తావా బావా?" అంది.

నేను రానన్నాను. కొమ్మలు లేతగా వున్నై. విరుగుతాయి వద్దన్నాను.

విన్లేదు. ఏ కొమ్మని పట్టుకోవచ్చో, ఏ కొమ్మమీద కాలూని నడవొచ్చో చూసుకుంటూ పోవచ్చని నమ్మకంగా చెప్పింది.

అయినా నేను భయపడ్డాను. నాకున్న లక్ష సందేహాల్ని ఆమెతో వాదనకు ఉపయోగించుకున్నాను.

శ్రీదేవి అనుకున్నదంటే ఆగుతుందా?!

పిల్లలందరికీ తన నిర్ణయాన్ని ప్రకటించింది. అరుపులు, కోలాహలం. వద్దనేవాళ్లు, ఉత్సాహపరచేవాళ్ళు. శ్రీదేవి లేచింది. తన గమనం సాగించింది.

సాహసి...శ్రీదేవి! అనుకున్నది సాధించింది చివరికి. అందరిచేత చప్పట్లు కొట్టించుకుంది. దిగివచ్చిన తరువాత అందరి అభినందనల్ని అందుకుంది.

మర్నాడు...

గోపాల స్వామి గుళ్లో కోనేరు మెట్లమీద కూర్చున్నప్పుడు అన్నది. "ప్రతిదానికీ భయమూ పిరికితనం ఎందుకు బావా? ప్రయత్నం చేయకపోతే సక్సెస్ ఎట్టా వస్తుంది?" అని

నేనేమీ మాట్లాడలేదు.

నా ఎం.ఏ.అయిపోగానే చదువు ఆపేస్తానని చెప్పినప్పుడు కూడా శ్రీదేవి అట్టాగే అన్నది. "కుటుంబ బాధ్యత అంతా నీ భుజస్కంధాలమీద ఉందనుకోవడంలో తప్పులేదుకాని, నీ భవిష్యత్తుని ఆలోచించుకోవాలి గదా. నువ్వు నీ చదువుని కొనసాగిస్తేనే బాగుంటుంది".

అప్పుడూ నేనేమీ మాట్లాడలేదు. చదువులు లేకుండా పెళ్లికి ఎదిగి కూర్చున్న ఇద్దరు చెల్లెళ్లూ, ఉన్న నాలుగెకరాల పల్లం పొలంతో చేతికి అంది నోటికి అందని ఫలసాయంతో- పల్లెలో అమ్మ పడుతున్న అగచాట్లు- నాకళ్లముందు నిలిచినై.

బిర్లా మందిర్‌లో మేమిద్దరమూ కలుసుకున్న వారం పదిరోజులకి ఒకరోజు- శ్రీదేవి టెలిఫోన్ కాలనీలో మా ఇంటికి వచ్చింది. చాలాసేపు కూర్చుంది. అమ్మ ఏవేవో పాత ముచ్చట్లు- ఏడాది క్రితం జరిగిపోయిన పెద్ద చెల్లెలు పెళ్లి విషయాలు ప్రస్తావించింది. నా చెల్లెలు రెండోది కరుణ కూడా శ్రీదేవితో కబుర్లు చెప్పింది.

మధ్యలో ఓసారి ఇంట్లో పచార్లు చేస్తున్నట్లు నడుస్తూ, నా గదిలోకి వచ్చింది శ్రీదేవి. బయటికి తయారౌతూ షర్టు బటన్‌లు పెట్టుకుంటున్నాను.

"నిన్న సాయంత్రం వాళ్ళు వచ్చి వెళ్ళారు." అన్నది, తనలో తను అనుకుంటున్నట్లు.

"ఎవరూ?" అన్నాను అసంకల్పంగా.

"అదే ఆ శ్రీముఖం వారు"

నేను పక్క చూపులు చూశాను. శ్రీదేవి మాత్రం నాకేసి చాలా సూటిగానే చూస్తున్నట్లు గమనించాను. ఆతరువాత మేమేమీ మాట్లాడుకోలేదు. మా ఇంట్లోవాళ్లకి ఈ విషయాలేవీ తెలియవు. మరో అరగంట తరువాత ఇద్దరమూ కలిసి బయల్దేరాము. బస్‌లో పోదామంటే వద్దు ఆటోలో వెళ్దామని తానే ఆటోని కేకేసింది. నేను కోఠీలో దిగితే, తాను చిక్కడ్‌పల్లి వెళ్లిపోయింది.

ఆటోలో నా మొహంకేసి చూస్తూ అన్నది. "నువ్వేమీ మాట్లాడటంలేదు బావా? నాకేమిటోగా వుంది." అని. దిల్‌షుక్ నగర్ బస్టాండ్‌ను చూస్తున్న నేను ఉలిక్కి పడి శ్రీదేవి వైపు చూశాను. "ఏం ఉన్నాయి మాట్లాడేందుకు?" అని ఒక పొడి నవ్వు నవ్వాను. మొహం అదోలా పెట్టి సర్దుకు కూర్చుంది శ్రీదేవి.

ఆ రాత్రంతా ఆలోచించాను. ఏదో దాగుడు మూతలాటగా అనిపిస్తోంది- శ్రీదేవికీ నాకు మధ్య సాగుతున్న సంభాషణ. జరుగుతున్న సంభవాలు ప్రమిదలో వెలుగుతున్న వత్తిని కిందికీ మీదికి కదిలిస్తున్నట్టు అనిపిస్తోంది.

ఆ మర్నాడు, అమ్మ ఏదో మాట్లాడుతూ మా పెళ్లి ప్రసక్తి తెచ్చింది. నేను భయపడ్డాను. ఆ సంభాషణ ఎటుసాగుతుందో, నేను ఏం మాట్లాడవలసి వస్తుందో అని. ఆమె మాటల గొలుసుకట్టు కరుణ పెళ్లి మీదికి మళ్లినప్పుడు ఊపిరి పీల్చుకున్నాను. కాని, కరుణ గడుసుగా అంది, "ముందు వదిన్ని మనింటికి రానీ" అని. మళ్లీ ఉలిక్కిపడ్డాను. అమ్మ వేరే పనిలో పడటంతో ఆ ప్రస్తావన అంతటితో ఆగింది.

ఆ సాయంత్రం మామయ్యా, అత్తయ్యా వచ్చారు. శ్రీముఖం వారి సంబంధం

గురించి అమ్మకు చెప్పారు. పిల్లవాడి తల్లిదండ్రులకు పిల్ల నచ్చినట్లు తెలిసిందని చెప్పారు.

అమ్మ తన అన్నా వదినలతో నిష్ఠూరమాడింది, శ్రీదేవికి పరాయి సంబంధం చూస్తున్నందుకు. అత్తయ్య అన్న మాటలు నాకు గొంతు దిగలేదు. ఆమె స్ఫుటంగానే అంది, "ఎటూ తేల్చకుండా ఎన్నాళ్లుంటాం. వచ్చేవయస్సుగదా ఆడపిల్లకి. ఒక్కగానొక్క పిల్ల దాని భవిష్యత్తేగదా మాకైనా. అందుకే ఈ సంబంధానికి మొగ్గు చూపాం!!

ఫిబ్రవరిలో శ్రీదేవి పెళ్లి జరిగిపోయింది. వరుడు శ్రీముఖం శ్రీనివాసరావు. పెళ్లికి అందరం కలుసుకున్నాము. నిజానికి పెళ్లిలో చాలా పనుల్లో నేను మామయ్యకు సహాయం చేశాను. శ్రీదేవి కూడా నాపట్ల ప్రత్యేక శ్రద్ధతో ప్రవర్తించింది. తన అత్త వారివైపు అందరికీ పరిచయం చేసింది. భర్త దగ్గర కూర్చొని, నలుగురితోనూ కబుర్లాడుతున్నప్పుడు నన్నూ పిలిచీ మాట కలిపింది. శ్రీనివాసరావు కూడా చాలా కలుపుగోలు మనిషి. అతనిది మంచి రూపం. మనిషి చక్కటి పసిమి. మాట తీరు కూడా సదభిప్రాయం కలుగజేసింది.

నిజానికి వాళ్లందరిమధ్యా నాకే మాటలు సరిగా రాలేదు. పరాయితనం ఫీలయ్యాను.

ఆవేళ ఆదివారం. అప్పుడే తెల్లారింది. ఎండచార కిటికీలోంచి నే పడుకున్న మంచంమీద పడి నా కాళ్లను తాకుతోంది. బయట పక్షి మందార చెట్టుమీద ఆడుకుంటోంది. నేను బద్ధకంగా లేచీ లేవని స్థితిలో ఉన్నాను.

కరుణ వచ్చి ఫోన్ వచ్చిందని కేకేసింది. ఆఫోన్ మా పక్కింటి వాళ్లది. లేచి గబగబా వెళ్లాను. శ్రీదేవి ఫోన్ అది. ఆవేళ రాత్రికి శ్యాంబాగ్ హోటల్లో డిన్నర్ట. "నువ్ ఎనిమిది గంటలకి హోటల్ గుమ్మందగ్గర ఉంటావు. నేనూ, శ్రీను అప్పటికే అక్కడ నిలబడి ఉంటాము. నువ్వు వస్తున్నావు" అని ఫోన్ పెట్టేసింది. ఇంటివాళ్లకు థాంక్స్ చెప్పి, నెమ్మదిగా కదిలేను.

ఎందుకో ఉత్సాహంగా లేదు. అయితే పదిరోజుల్లోనే భర్తను ముద్దుగా శీను అంటున్న శ్రీదేవి పలుకుబడి ఏదో ఉత్సాహాన్నిచ్చింది. నాలోనేను నవ్వుకుంటూ ఇంట్లోకొచ్చాను.

అమ్మ అడిగింది. "ఎవరూ" అని. చెప్పాను.

ఆ రాత్రి ఎనిమిదింటికి హోటల్‌కు వెళ్ళాను.

నేనూ, శ్రీదేవి, శ్రీనివాసరావు అంతే. మేం ముగ్గురమే. వేరే ఎవరూ లేరు. ఆ డిన్నర్ మాకు మాత్రమే ఏర్పాటు చేసినట్లు నా సందేహం నివృత్తి చేసింది శ్రీదేవి. టేబుల్ దగ్గర కూర్చున్నాము.

ముందుగా అసందర్భమైన పరామర్శలతోనూ, అప్రస్తుతమైన రాజకీయాలతోనూ కొంత సమయం గడిపాము. శ్రీనివాసరావు ఆతరువాత స్టేట్స్‌లో తన ఉనికి గురించి, ఉద్యోగం గురించి చెప్పాడు. భోజనానికి ఆర్డరిచ్చింది శ్రీదేవి. ముందుగా సూప్ చెప్పింది, " యువిల్ బి ఇన్ సూప్ ఫస్ట్" అని నాకేసి చూస్తూ జోక్ చేసింది. సన్నగా నవ్వుతూ...

"వుయ్ ఆల్ విల్ బీ" అన్నాడు శ్రీనివాసరావు.

ముగ్గురమూ నవ్వుకున్నాం.

సూప్ వచ్చింది. సిప్ చేస్తున్నాం.

అదిగో, అప్పుడు మొదలెట్టింది శ్రీదేవి.

"నిజానికి నేను మా బావ మనిషిననీ, అతను నావాడనీ చిన్నప్పట్నుంచీ మా వాళ్లందరు చేసిన నిర్ణయమే. మేమూ అలాగే భావిస్తూ వచ్చామనేది కూడా యదార్థం".

నేను గతుక్కుమన్నాను. శ్రీనివాసరావు శ్రీదేవిని వింటూ కూర్చున్నాడు... టీచర్ చెప్తున్న పాఠం వింటున్న విద్యార్థిలా. శ్రీదేవి భర్తను ఉద్దేశించి కొనసాగించింది.

ఆమె సంభాషణ సారాంశం ఇలా వుంది.

"అయితే,

మా బావ స్లో మనిషి. అన్ని వ్యవహారాలన్నీ, 'పార్కలాం' పద్దతిలో చూస్తాడు. చివరికి మీ సంబంధం గురించి మా బాబాయ్ చెప్పినప్పుడు; మా వాళ్లు ముందుకు నడుస్తున్నప్పుడు కూడా మా బావతో ఈ విషయం ప్రస్తావించాను.

విని ఊరుకున్నాడు. అందుకే నా నిర్ణయం నేను తీసుకున్నాను. ఈ బ్యాక్‌గ్రౌండ్ చెప్పాలనే ఇక్కడ కలుసుకున్నది. భయమూ పిరికితనమూ నాకు నచ్చవు. అవి బావదగ్గర అణువణువునా ఉన్నాయి."

శ్రీనివాసరావు మా ఇద్దరినీ చూస్తూ " బాగుంది, థింక్స్ ఆర్ క్లియర్," అని తన ప్రోగ్రాం గురించి చెప్పాడు. నెలాఖరుకు తిరిగి అమెరికా వెళ్లనున్నట్లు,ఈలోగా శ్రీదేవికికూడా వీసా వస్తే ఆమెను తీసుకువెళ్తాడట. లేకుంటే ఆమె ఆతరువాత విడిగా వెళ్తుందిట.

మా చిన్ననాటి ముచ్చట్లు చెప్తూ భోజనం ముగించింది శ్రీదేవి. మధ్యలో ఒక మాట అన్నది "పొసగదనుకున్న పొత్తుకంటే, స్నేహితులుగా ఉండిపోవడమే మేలు" అని. ఆతరువాత నేను నా ఇంటికి వచ్చేశాను.

అంతే... ఆ రాత్రి కలవడమే శ్రీదేవిని. ఈ ఆరేళ్లలోనూ మళ్లీ కలువలేదు.

***

చెప్పటం ఆపి, నారాయణను అడిగాను, "ఇదీ కథ. ఇప్పుడు చెప్పు. నేను శ్రీదేవిని చేసుకోలేకపోవటానికి ఏమిటి కారణం?"

దీర్ఘంగా నిట్టూర్చాడు నారాయణ. లేచి కూజాలోని మంచినీళ్లు గ్లాసులో ఒంపుకొని గటగటా తాగేడు. "మొదట్లో వద్దన్నాను నీళ్లు, ఇప్పుడు కావలసి వచ్చినై." అంటూ, "సాదా సీదా ప్రేమ కథ చెప్పావు. అయినా మంచినీళ్ళు తాగించావు" అన్నాడు.

"నయమయ్యే రోగం కాదు కానీ, మంచి కేసు దొరికింది" అన్నాడట నీలాంటి డాక్టర్ ఎవరో" అని నవ్వాను.

నారాయణ సన్నగా నవ్వుతూ అన్నాడు, " అవును. నీ కథలో ఏదో గ్యాప్ ఉంది; ఏదో మిస్సింగ్ లింక్ ఉంది. అదేమిటో ఇదమిద్ధంగా తెలియటంలేదు. నువ్వే చెప్పు"

నేను కొద్దిగా చలించాను. కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాను. ఆలోచించి ఆలోచించి చివరికిలా తేల్చుకున్నాను. "నేను మితి మనిషిని. ఇలా

కుండబద్దలు కొట్టినట్టు శ్రీదేవే చెప్పింది, వాళ్లాయన ముందు. కానీ శ్రీదేవినే వద్దనుకునేటంతటి మొద్దు స్వరూపాన్నా నేను?" ఈ మాటలు పైకే అన్నాను.

నారాయణ విన్నాడు. "మరి?" అన్నాడు మంద్రంగా.

"నేను తను చేరుకోవాలనుకున్న చిటారుకొమ్మలకి తనతోపాటు కలిసి ఎక్కలేనని బాగానే అర్థం చేసుకుంది శ్రీదేవి. తనకు నేను అక్కర్లేదు అని చాలా కాలం క్రితమే నిశ్చితంగా నిర్ణయించుకోగలిగింది శ్రీదేవి. ఆమెకు కావలసిందల్లా నేనూ అలాంటి నిర్ణయమే తీసుకున్నాననే మాట మాత్రమే. ఆ మాట నానోట వస్తే సంతృప్తి పడేది. సంతోషపడేది. మా బావ నన్ను చేసుకోనన్నాడు కనుక నేను మరొకర్ని చూసుకుంటున్నానని చెప్పుకోగలిగేది. ఆ సంతృప్తినీ, సంతోషాన్నీ, అవకాశాన్నీ నేను ఇవ్వనని అర్థంకాగానే తానే చొరవ తీసుకుంటున్నట్లు, ఆ చొరవకి నా స్లోనెస్, నా భయం, నా పిరికితనం కారణమైనట్లు చెప్పి తనను తాను పైమెట్టులో నిలుపుకుంది. ఎంతైనా సైకాలజీ డాక్టర్ కదా!"

నారాయణ స్థబ్దంగా కూచునే వున్నాడు.

మా ఇద్దరిమధ్య గాలి బొంగురు పోతోంది!

ఈ కథలోనూ ఇజాలూ, దోపిడీ గట్రా కనిపిస్తున్నాయి కాబోలు, కిటికీ లోంచి బయటికి చూపులు సారించి ప్రకృతిని పరీక్షిస్తున్నాడు.

నాకు చంద్రుడు కనిపిస్తున్నాడు. వేపచెట్టు ఆకులు శకలాలు శకలాలుగా కత్తిరించి వేస్తున్నై... చంద్రుణ్ణీ, అతని చల్లదనాన్నీ!

శరీరంలో అర్థంకాని వేడిమి ప్రవహిస్తోంది.!

***

(విశాలాంధ్ర 12-3-1995)